క్లుప్తంగా

మాచవరం పీహెచ్‌సీకి సామగ్రి వితరణ



మాచవరం పీహెచ్‌సీకి సామగ్రిని అందిస్తున్న వెంకటరెడ్డి, అప్పారెడ్డి తదితరులు

రాయవరం: మండలంలోని మాచవరం పీహెచ్‌సీకి అదే గ్రామానికి చెందిన కొవ్వూరి అప్పారెడ్డి శనివారం పీహెచ్‌సీకి అవసరమైన సామగ్రిని ఉచితంగా అందజేశారు. రోగులకు వినియోగించే ఆలోక్లేవ్ మెషీన్ విత్ బిన్స్, సెంట్రిఫ్యూజ్, నెబులైజర్ పరికరాలను అందజేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీనివాస్, చంద్రకుమారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పడాల వసంతకుమార్‌రెడ్డి, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ మేడపాటి వెంకటకృష్ణారెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ తమలంపూడి సత్యనారాయణరెడ్డి, రెడ్డి సంఘం అధ్యక్షుడు మేడపాటి వెంకటరెడ్డి, స్థానిక నేతలు మేడపాటి బసివిరెడ్డి, మాచర్రల ఉమా మహేష్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ చిత్రపటానికి నేతన్నల క్షీరాభిషేకం



నల్లూరు చేనేత సొసైటీ వద్ద జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నేత కార్మికులు

కపిలేశ్వరపురం: ఆధునికత నేపథ్యంలో చేనేత వృత్తి తీవ్ర సంక్షోభంలో ఉంది. గత ప్రభుత్వం చేనేత కార్మికులను నిర్లక్ష్యం చేసింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన నాలుగున్నరేళ్ల పాలనలో నేతన్న నేస్తం పేరుతో ఒక్కో చేనేత కుటుంబానికి రూ.24 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని అందించారు. ఆ సాయాన్ని ప్రశంసిస్తూ మండలం నల్లూరు చేనేత సహకార సంఘం వద్ద నేత కార్మికులు సీఎం జగన్ చిత్రపటానికి శనివారం క్షీరాభిషేకం చేశారు. నల్లూరు చేనేత సహకార సంఘం చైర్మన్ సిద్ధాని వీరవెంకట సూరిబాబు ఆధ్వర్యంలో చేనేత కార్మికులు తమ సంతోషాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో మండల సాగు సలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి, సర్పంచ్ కరుపూడి ఉదయశ్రీ , వైఎస్సార్ సీపీ నాయకులు కురుపూడి రాంబాబు, శివశంకర్, మార్ని పూసబ్బు, సచివాలయ కన్వీనర్ అతికెల శంభులింగం పాల్గొన్నారు.

దేవతామూర్తులకు చైర్‌పర్సన్ పూజలు



పడమర ఖండ్రికలోని త్రయంబకేశ్వరస్వామి ఆలయంలో చైర్‌పర్సన్ దుర్గారాణి

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర, పడమర ఖండ్రిక గ్రామాల్లోని దేవతామూర్తులకు మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి శనివారం పూజలు చేశారు. పడమర ఖండ్రికలోని ఉయ్యాల జంపాల క్షేత్రంలోని అన్నపూర్ణ సమేత త్రయంబకేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కు చెల్లించుకున్నారు. అంగరలోని వైభవ వేంకటేశ్వరస్వామి, సుబ్రమణ్యేశ్వరస్వామి, అశిరాంబ అమ్మవార్లను దర్శించుకొన్నారు. ఆమె వెంట రెండు పంచాయతీల సర్పంచ్‌లు తిరునాతి ఆదిలక్ష్మి, వాసా కోటేశ్వరరావు, చేనేత సహకార సంఘం చైర్మన్ గుడిమెట్ల శివరామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు యరమాటి వెంకన్నబాబు, తిరునాతి వెంకటేశ్వరరావు, కవల శ్రీను, సంకాబత్తుల స్వామి కాపు, షేక్ మస్తాన్, మామిడి రాంబాబు, నేల సూర్యకుమార్, ఆరి చిన్న, బడుగు రాంబాబు ఉన్నారు.

మైత్రి మెకానికల్ వర్కర్స్ సంఘాధ్యక్షుడిగా వేణు

మండపేట: పట్టణంలో నూతనంగా ఏర్పడిన మైత్రి మెకానికల్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రేలంగి వేణుగోపాలరావు ఎన్నికయ్యారు. సంఘ సభ్యత్వ నమోదు, కార్యవర్గం ఎన్నిక శుక్రవారం స్థానిక బ్యాంకు కాలనీలోని సంఘ కార్యాలయం వద్ద జరిగింది. అధిక సంఖ్యలో మెకానిక్, పెయింటింగ్, టింకరింగ్ కార్మికులు సభ్యత్వ నమోదు చేసుకున్నారు. అనంతరం జరిగిన కార్యవర్గం ఎన్నికలో అధ్యక్షుడిగా వేణుగోపాలరావు, ఉపాధ్యక్షుడిగా మాంద్రు వరప్రసాద్‌చౌదరి, కార్యదర్శిగా తీరందాసు శివకుమార్, ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని ట్రేడ్ యూనియన్ నాయకులు టపా పుల్లేశ్వరావు, కొండపల్లి సూర్యనారాయణ అభినందించారు. తొలుత కార్మికులు అందరికీ రాజమహేంద్రవరం పోస్టల్ బ్యాంక్ మేనేజర్ చెబోలు వంశీకృష్ణ ప్రధాన మంత్రి సురక్ష యోజన ప్రమాద బీమా నమోదు చేశారు. ఆటోమొబైల్ నాయకులు సుందరపల్లి వెంకటరత్నం, పోస్టల్ సిబ్బంది కామేశ్వరి, ఝాన్సీ, నాగలక్ష్మి, కార్మిక సంఘ సభ్యులు కాపా మధుకుమార్, కటారి శ్రీనివాస్, యాదగిని సత్యప్రసాద్, యర్రా నాగేశ్వరావు, కడియాల వెంకటరమణ పాల్గొన్నారు.



కూళ్లలో నీటమునిగిన ఇటుక బట్టీలు



మల్లవరం వద్ద నీట మునిగిన బెండ, కూరగాయల తోటలు



కోటిపల్లి రేవులో పోలీసులు ఏర్పాటు చేసిన ప్రమాద హెచ్చరికను దాటి ప్రవహిస్తున్న వరదనీరు

గుండెల్లో గోదావరీ

- ఆందోళనలో నదీ పరీవాహక ప్రజలు
- ఐదు రోజులుగా నిలిచిపోయిన పంటు ప్రయాణం

కె.గంగవరం: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు వారం వ్యవధిలో రెండో సారి కోటిపల్లిలో వరద గోదావరి ఉగ్రరూపం దాల్చింది. రెండు రోజుల క్రితం గోదావరి ఉధృతి తగ్గుతుందని ఊపిరి పీల్చుకుంటున్న లంక గ్రామాల ప్రజలు, గోదావరి పరీవాహక ప్రాంత ప్రజల్లో మళ్లీ ఆందోళన నెలకొంది. తాజాగా ఇటీవల ఎగువన కురిసిన వర్షాలకు ధవళేశ్వరం కాటన్ బ్యారేజీకు భారీగా వరద చేరుతుంది. దీంతో మండలంలోని కూళ్ల నుంచి బ్రహ్మపురి వరకు వరద గోదావరి ఉగ్రరూపం దాల్చింది. సముద్రంలోకి వరద నీరు కలిసేందుకు ఉరకలు వేస్తూ పరవళ్లు తొక్కుతుంది. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు గంట గంటకు గోదావరి పెరుగుతూనే ఉందని స్థానికులు అంటున్నారు. దీంతో పాటు గోదావరి పోటు కారణంగా కోటిపల్లి వరకు వరద ఉధృతి మరింత ప్రమాదకరంగా మారింది. ప్రస్తుతం పుష్కర ఘాట్లు మొత్తం నీట మునిగాయి. రేవులో మర్రి చెట్టు మొదలు వరకు వరదనీరు ప్రవహిస్తుంది.

నిలిపోయిన పంటు ప్రయాణం..

గోదావరి వరదనీరు భారీగా వచ్చి చేరడంతో కోటిపల్లి–ముక్తేశ్వరం పంటు ప్రయాణాన్ని రెవెన్యూ అధికారులు ఐదో రోజు కూడా నిలిపివేశారు. రేవు దాటిన తరువాత ముక్తేశ్వరం వద్ద ఏర్పాటు చేసిన కంకర రోడ్డు గోదావరిలో కొట్టుకుపోయింది. దీంతో పాటు ఎన్నడూ లేని విధంగా రెండు తూరలు కూడా వరద ఉధృతికి కొట్టుకుపోవడంతో పంటు ప్రయాణానికి ఆటంకం కలిగింది.

నీటమునిగిన మత్స్యకార కాలనీ

గోదావరి ఒడ్డునే ఉన్న పాకల్లోకి వరద వచ్చి చేరింది. సుమారు 50 గడ్డి, పెంకుటిళ్లలోకి వరద రావడంతో వారు పక్కనే ఉన్న బంధువుల ఇళ్లలో సర్దుకున్నారు. కొందరు ఆ వరద నీటిలోనే ఇళ్లల్లోనే ఉండిపోయారు. ప్రతి రోజు గోదావరిలో ఉండే నాటు పడవలు ఇళ్ల ముందుకు వచ్చి చేరాయి. కూళ్ల నుంచి కోటిపల్లి వరకు గోదావరి ఏటిగట్టు వద్ద ఉన్న ఇటుకల బట్టీలు నీట మునిగాయి. దీంతో పాటు పాకలు, పెంకుటిళ్లు సావిడి వంటి కూడా నీటమునిగాయి. కూళ్ల నుంచి బ్రహ్మపురి వరకు గల లంక పొలాల్లోని బొప్పాయి, కూరగాయలు, కొబ్బరి తోటలు నీటమునిగాయి.



నారాయణలంక వద్ద పశువుల తరలింపు చర్యల్లో పశు వైద్యాధికారి ఇందుప్రియ, సిబ్బంది



కపిలేశ్వరపురం గోదావరి గట్టు వద్ద ఫ్లడ్ డ్యూటీ చేస్తున్న వలంటీర్లు

గస్తీ కాస్తున్న వలంటీర్లు, రెవెన్యూ సిబ్బంది

గోదావరిలో అనుమతి లేకుండా నాటు పడవలు వెళ్లకుండా, ప్రజలు స్నానాలకు దిగకుండా వలంటీర్లు, రెవెన్యూ సిబ్బంది గస్తీ కాస్తున్నారు. అధికారుల సూచనల మేరకు కోటిపల్లి రేవులో అముజూరు, పేకేరు, యండగండి, దంగేరు, కుందూరు, మసకపల్లి తదితర గ్రామాల వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు ఫెర్రీ వద్దే ఉండి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

గోదారి జోరు.. జనం బేజారు

కపిలేశ్వరపురం: ఎగువ నుంచి గోదావరి వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. మండలంలోని అద్దంకి వారిలంక, పల్లపులంక, వీధివారిలంక, కేదారిలంక, నారాయణలంక గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. తామున్నామంటూ ప్రభుత్వ యంత్రాంగం వారందరికీ భరోసా ఇస్తున్నారు. రేయింబవళ్లు గోదావరి గట్టు వెంబడి విధులు నిర్వహిస్తున్నారు. వ్యవసాయ క్షేత్రాల నుంచి పశువులను తరలించేందుకు తోడ్పాటు అందిస్తున్నారు. కొత్తపేట, వాడపాలెం, వానపల్లిలలోని పునరావాస కేంద్రాల్లో అధికారులు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశారు. మొత్తం చర్యలను జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) కృష్ణకుమారి ఆదేశాలపై తహసీల్దార్ కొమరం సూర్యారావు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి పర్యవేక్షిస్తున్నారు. కేదారిలంక, నారాయణలంక, అద్దంకివారిలంక గ్రామాల్లోని కాజ్‌వేలను వరద నీరు తాకింది. వలంటీర్లు గోదావరి గట్టు వెంబడి ఫ్లడ్ డ్యూటీలు నిర్వహిస్తున్నారు. ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలోని వరద పరిస్థితులను అధికారులకు తెలియజేసి సమస్యలను పరిష్కరించడంలో వారి సేవలను లంక గ్రామాల ప్రజలు ప్రశంసిస్తున్నారు. గోదావరి నదివైపు వెళ్లకుండా కేదారిలంక తదితర ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారు. మండల పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ సీహెచ్ ఇందుప్రియ, వైద్యులు డాక్టర్ జి.భానుప్రసాద్ ఆధ్వర్యంలో పశువుల సంరక్షణ చర్యలు చేపట్టారు. లంక గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు.



నారాయణలంకలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో తహసీల్దార్

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

వరద ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి వేణు పర్యటన

కె.గంగవరం: గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ శనివారం గోదావరి పరీవాహక ప్రాంతాల్లో పర్యటించారు. కోటిపల్లి రేవులోని ఫెర్రీ వద్ద గోదావరి వరద పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం నీటమునిగిన మత్స్యకార కాలనీలో ఆయన పర్యటించి వారి సాదకబాధకాలను తెలుసుకుని పరామర్శించారు. పంటుపై ప్రయాణించి ఇంటింటికీ వెళ్లి వారిని పరామర్శించారు. సుందరపల్లి శివారు కుమ్మరిసావరం వద్ద ఏటిగట్టు గట్టు బలహీనంగా ఉండడంతో పీడబ్ల్యూడీ అధికారులు గట్టును పటిష్టం చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. వారి వద్ద మంత్రి వేణు ఆగి కొంత సేపు ఇసుక బస్తాలతో స్వయంగా ఆయనే మోసి గట్టును పటిష్టం చేయడానికి సహాయం చేశారు. గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలు అధైర్యపడొద్దని ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రతి ఏటా కోటిపల్లిలోని మూడు కాలనీలు వరద ముంపుకు గురికావడం చూస్తున్నామని వారికి అధికారులు వెంటనే మంచినీరు, ఆహారం అందించాలని ఆదేశించారు. వరద ఉధృతి కారణంగా చేపల వేట నిషేధం ఉండడంతో తక్షణం మత్స్యకార కుటుంబాలకు రేషన్ సరకులు అందించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు పాటించాలని వరద సమయంలో ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు. లంకల్లో ఉన్న పశువులను వెంటనే గట్టుకు చేర్చాలని జీవాలకు కావాల్సిన దాణా అందించే ఏర్పాట్లు చేస్తామన్నారు. సర్పంచ్ పెమ్మాడి బేబీ, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ పప్పుల మసేను వెంకన్న(రేవు శ్రీను), డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, మండల సచివాలయాల కన్వీనర్ తోకల శ్రీను, ఎంపీటీసీ పిల్లి దుర్గాప్రసాద్, తహసీల్దార్ వైద్యనాథ్‌శర్మ, పీడీబ్ల్యూడీ ఏఈ సుబ్బారావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కాజులూరు: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గొల్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి సీవీఎల్ శ్రేయ అన్నారు. శనివారం పీహెచ్‌సీలో జరిగిన ఏఎన్‌ఎంలు, ఆశా వలంటీర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ఆరోగ్య సిబ్బంది స్థానికులకు అవగాహన కల్పించాలన్నారు. వర్షాల కారణంగా నీరు కలుషితమై అంటువ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని మూడు రోజుల కంటే ఎక్కువ జ్వరం ఉండి, బీపీ తగ్గితే వెంటనే నిపుణులైన వైద్యులను సంప్రదించాలన్నారు. తప్పనిసరిగా కాచి చల్లార్చిన నీటినే తాగాలని మార్కెట్‌లో దొరికే కలుషిత ఆహారాన్ని తినకూడదన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు ఎ.వైకుంఠరావు, వై.నాగబాబు, ప్రసన్న, రాజారావు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమాన్ని వివరిస్తూ..

రామచంద్రపురం రూరల్: మండలంలోని యనమదల శివారు అంబికపల్లి అగ్రహారంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ శనివారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి సీఎం జగన్ ప్రభుత్వంలో ఆ కుటుంబానికి అందిన సంక్షేమాన్ని వివరిస్తూ సమస్యలను అడిగి ఆయా సమస్యల పరిష్కారానికి అధికారులకు తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో మంత్రి వేణు తనయుడు నరేన్, గ్రామ సర్పంచ్ పంపన వీర వెంకటరమణ, ఎంపీటీసీ నురుకుర్తి శ్రీరామకృష్ణ, ఎంపీపీ అంబాటి భవాని, పీఏసీఎస్ చైర్మన్ పిల్లి బాలసుబ్రమణ్యం, మల్లేశ్వర స్వామి ఆలయ చైర్మన్ కుక్కల గోవిందు, గ్రామ పెద్దలు కంటిపూడి కృష్ణ, ఎంపీడీవో ఎన్.షెలత్ రాజు, ఆర్‌ఐ పెంకే ముని, ఏపీవో అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.



యనమదలలో మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

అగ్నిప్రమాద బాధితులకు సాయం



అగ్నిప్రమాద బాధితులకు సాయం అందజేస్తున్న కాటే సుబ్రహ్మణ్యం తదితరులు

కాజులూరు: మండలంలోని ఉప్పుమిల్లిలో ఇళ్ల అగ్ని ప్రమాదానికి గురైన బాధిత కుటుంబీకులకు ప్రజాసేన సభ్యులు సాయం అందజేశారు. గత నాలుగు రోజుల క్రితం గ్రామానికి చెందిన పంపన వెంకటరమణ ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు గురై కాలి బూడిదయింది. ఈ ప్రమాదంలో వెంకటరమణ కుటుంబీకులు నిరాశ్రయులై కట్టుబట్టలతో వీధిన పడ్డారు. విషయం తెలుసుకున్న ప్రజాసేన అధ్యక్షుడు కాటే సుబ్రహ్మణ్యం శనివారం బాధిత కుటుంబీకులను పరామర్శించి వారికి రూ.25 కేజీల బియ్యం, నిత్యావసరాలు అందజేశారు.

సత్తెమ్మ సన్నిధి.. మందుబాబుల విడిది

- ఇక్కట్లు పడుతున్న భక్తులు, ప్రయాణికులు
- నియంత్రించాలని పోలీసులకు విజ్ఞప్తి



మద్యం మత్తులో ఆలయం వద్ద పడి ఉన్న వ్యక్తి (ఫైల్)

మండపేట: పట్టణంలోని గొల్లపుంత కాలనీలో గల సత్తెమ్మ తల్లి ఆలయం వద్ద మందుబాబుల ఆగడాలు ఎక్కువయ్యాయి. దాంతో భక్తులు, దారిన వెళ్లేవారు అసౌకర్యానికి గురవుతున్నారు. దాదాపు 1,800 కుటుంబాలు నివసిస్తున్న గొల్లపుంత కాలనీలోని సత్తెమ్మతల్లి గ్రామదేవతగా పూజలందుకుంటోంది. కాలనీకి మధ్యలో మెయిన్ రోడ్డు పక్కనే ఆలయం ఉండడంతో స్థానికులు అమ్మవారిని దర్శించుకుని తమ తమ పనులపై బయలు దేరుతుంటారు. ఆలయానికి వచ్చే భక్తులు కూర్చునేందుకు దాతలు ఆలయం రోడ్డు పక్కన బెంచీలు ఏర్పాటు చేశారు. కొందరు ఆకతాయిలు ఈ బెంచీలు, ఆలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలాన్ని మద్య పానానికి నిలయంగా మార్చుకున్నారు. మద్యం మత్తులో వీరు చేసే ఆగడాలకు ఆలయానికి వచ్చే భక్తులతో పాటు దారిన వెళుతున్న వారు భయాందోళన చెందుతున్నారు. ఖాళీ మద్యం బాటిళ్లు, ప్లాస్టిక్ గ్లాసులను ఆలయం వద్ద గల డ్రైన్‌లో పడేస్తున్నారు. పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలోని కాలనీకి పోలీసుల గస్తీ అంతంతమాత్రంగానే ఉంటోంది. కాలనీలోని కొన్ని కిరాణా షాపుల నిర్వాహకులు మద్యం బాటిళ్లు తెచ్చి విక్రయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రాత్రి వేళల్లో ఆయా దుకాణాల వద్ద మద్యం దొరుకుతుండడంతో మందుబాబుల ఇష్టారాజ్యంగా మారిందంటున్నారు. ఆలయం ఎదురుగా గల లే అవుట్ స్థలంలో, గొడ్డుకాలువ వంతెన వద్ద రాత్రి వేళల్లో గుంపులుగా చేరి మద్యం సేవించడంతో పాటు గొడవలకు దిగుతున్నారని చుట్టుపక్కల వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆకతాయిల ఆగడాలకు చెక్ పెట్టడంతో పాటు కాలనీలో అనధికార మద్యం అమ్మకాలు కట్టడికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

త్యాగధనుల ఆశయాలు కొనసాగించాలి



మండపేట జామియా మసీదు ప్రార్థనల్లో ముస్లింలు



కపిలేశ్వరపురంలో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

మండపేట: ఇస్లాం కోసం ప్రాణాలు అర్పించిన త్యాగధనుల ఆశయాలను కొనసాగించేందుకు అందరూ పాటుపడాలని మండపేట జామియా మసీదు ఇమామ్ మహ్మద్ ముర్షిద్ రజ్వీ అన్నారు. మొహర్రం సందర్భంగా శనివారం స్థానిక జామియా మసీదు, చిన్న మసీదులు ముస్లింలతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇమామ్ ముర్షిద్ రజ్వీ మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త మనువడు హజరత్ ఇమాం హుస్సేన్, వారి పరివారం కార్బల యుద్ధ మైదానంలో వీరోచిత పోరాటం ఇస్లాం చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించబడిందన్నారు. హుస్సేన్ ప్రాణ త్యాగాన్ని ఎవరు మర్చిపోలేరన్నారు. అప్పటి చారిత్రక ఘట్టం గూర్చి వివరించారు. ప్రత్యేక ప్రార్థనల్లో అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

ఇమామ్ త్యాగం స్ఫూర్తిదాయకం

కపిలేశ్వరపురం: ఇమామ్ త్యాగం స్ఫూర్తిదాయకమని మొహర్రం వేడుకల్లో పాల్గొన్న వక్తలు పేర్కొన్నారు. శనివారం మొహర్రం సందర్భంగా అంగర, కపిలేశ్వరపురం గ్రామాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలను చేశారు. కపిలేశ్వరపురంలో పీర్లను ఊరేగించారు. అంగరలోని మస్జిద్–ఎ–ఇబ్రహీమలో ముతవల్లి మహ్మద్ అబ్బాస్ హుస్సేన్ ఆధ్వర్యంలో ప్రార్థన చేశారు. మొహర్రం ప్రాముఖ్యతను వివరించారు.

రక్తం చిందిస్తూ ఇమామ్ హుస్సేన్‌కు నివాళి

రామచంద్రపురం రూరల్: హజరత్ ఇమామ్ హుస్సేన్, అతని పరివారం అమరత్వం పొందిన రోజు సందర్భంగా మొహరంను శనివారం నిండుశోకంతో ద్రాక్షారామలో జరుపుకొన్నారు. కత్తులు, బ్లేడులు, గొలుసులతో ముస్లింలు తమ శరీరాలను గాయపర్చుకుని రక్తం చిందించి, మాతం చేశారు. మసీదులో అమరవీరుల పేరిట ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇమామ్ హుస్సేన్, అతని పరివారం అమరత్వం పొందిన సంఘటనలను వివరించారు. నమాజులు చేశారు. ఉపవాసాలు ఉన్నారు. అలాగే సాయంత్రం పీర్లకు ఊరేగింపు నిర్వహించారు. అలాగే ముస్లింలు ద్రాక్షారామ మసీదు ప్రెసిడెంట్లు, గురులో యువత, మహిళలు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ముస్లింలు, హిందువులు అందరూ పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

దివ్యాంగుల సంఘం గౌరవాధ్యక్షుడిగా 'దొమ్మలపాటి'



నియామక పత్రాన్ని అందుకుంటున్న సత్యనారాయణ

రామచంద్రపురం: నియోజకవర్గం దివ్యాంగుల గౌరవ అధ్యక్షుడిగా ప్రముఖ న్యాయవాది, హితకారిణి సమాజం డైరెక్టర్ దొమ్మలపాటి సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు దివ్యాంగుల సంఘం గౌరవాధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి ముత్యాల పోసికుమార్, జిల్లా ఎంప్లాయిస్ రాష్ట్ర అధ్యక్షుడు సూరంపూడి మాణిక్యాలరావు, జిల్లా అధ్యక్షుడు పలివెల ప్రసాద్ చేతుల మీదుగా రామచంద్రపురంలో శనివారం జరిగిన కార్యక్రమంలో నియామక పత్రాన్ని అందుకున్నారు. పట్టణ బార్ అసోసియేషన్ అధ్యక్షులు పిల్లి మురళి, కార్యదర్శి వాడ్రేవు సాయిప్రసాద్, న్యాయవాదులు చింతపల్లి శ్రీను, పలివెల సత్యనారాయణ తదితరులు అభినందనలు తెలియజేవారు.

కపిలేశ్వరపురంలోని రెండిళ్లలో చోరీలు



చోరీ జరిగిన ఇంటిలో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

కపిలేశ్వరపురం: స్థానికంగా ఇద్దరి నివాసాల్లో శుక్రవారం రాత్రి చోరీలు జరిగాయి.అంగర ఎస్సై జి.చంటి సమాచారంపై జిల్లా క్లూస్ టీం ఎస్సై కె.ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలోని బృందం ఆయా నివాసాల్లో ఆధారాలను సేకరించే ప్రయత్నం చేశారు. ఎస్సై చంటి కథనం ప్రకారం... కపిలేశ్వరపురానికి చెందిన నెక్కంటి శ్రీరాంజీ తన కుటుంబ సభ్యులతో కలిసి కాశీ వెళ్లారు. కాగా శుక్రవారం రాత్రి ఆయన ఇంటి తలుపులు పగల కొట్టి ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. బంధువుల సమాచారంపై పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిలోకి ప్రవేశించినట్టు గుర్తించారు. వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. గాంధీ సెంటర్ వద్ద మరో ఇంటిలోనూ చోరీకి పాల్పడ్డారు. పూర్తి విచారణ తర్వాత వివరాలు వెల్లడిస్తామని ఎస్సై చంటి తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరి అరెస్టు

మండపేట: పట్టణంలో శనివారం రాత్రి పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. స్థానిక కలువపువ్వు సెంటర్‌లో పట్టణ ఎస్‌ఐ కె.అప్పారావు సిబ్బందితో కలిసి వాహన చోదకులను తనిఖీ చేశారు. మద్యం సేవించి వాహనాన్ని నడుపుతున్న ఒక మోటార్ సైకిలిస్టుపై కేసు నమోదు చేశారు.

పలువురికి ఎమ్మెల్యే వేగుళ్ల పరామర్శ

మండపేట: అయిన వారిని కోల్పోయి తీవ్ర విషాదంలో ఉన్న పలు కుటుంబాలను శనివారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పరామర్శించారు. మండలంలోని ఏడిద, పట్టణంలోని 5, 17, 22, 25,. 27 వార్డుల్లో పర్యటించి బాధితులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

రాయవరం ఇన్‌చార్జ్ ఎస్సైగా నరేష్



నరేష్

రాయవరం: రాయవరం పోలీసుస్టేషన్ ఇన్‌చార్జ్ ఎస్సైగా నరేష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న పీవీవీఎస్ఎన్ సురేష్ పది రోజులుగా సెలవుపై వెళ్లారు. దీంతో ఎస్పీ కార్యాలయంలో పనిచేస్తున్న నరేష్‌ను ఇన్‌చార్జ్‌గా ఎస్సైగా నియమిస్తూ జిల్లా ఎస్పీ ఉత్తర్వులు ఇచ్చారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు విధుల్లో చేరినట్లు ఇన్‌చార్జ్ ఎస్సై నరేష్ తెలిపారు.

అనధికార మద్యం విక్రయాలపై పోలీసుల దాడులు

కాజులూరు: మండలంలోని పెద్దలంక, కోలంక తదితర గ్రామాల్లో అనధికార మద్యం విక్రయాలపై తాళ్లరేవు ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించి ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. ఈ సంఘటనకు సంబంధించి శనివారం తాళ్లరేవు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జేవీ భవాని తెలిపిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. స్థానికుల సమాచారం మేరకు గ్రామాల్లో దాడులు నిర్వహించగా కోలంకకు చెందిన బొర్రా వీరబాబు యానం మద్యం నుంచి తీసుకువచ్చి అనధికారికంగా విక్రయిస్తూ పట్టుబడ్డాడన్నారు. అతడి వద్ద నుంచి 10 మద్యం సీసాలను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి కాకినాడ కోర్టుకు తరలించామన్నారు.

ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలి

రామచంద్రపురం: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంతో పాటుగా మానసికంగా ఉల్లాసంగా ఉండేందుకు తప్పనిసరిగా వ్యాయామం చేయాలని వాకర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు తొగరు మూర్తి అన్నారు. కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్‌లను రామచంద్రపురం సీఐ వి.దుర్గారావు, వాకర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు తొగరు మూర్తి ప్రారంభించారు. మూర్తి మాట్లాడుతూ కృత్తివెంటి పేర్రాజు పంతులు జిమ్‌కు రూ.70 వేల విలువైన 150 కేజీల విభాగం పవర్‌లిఫ్టింగ్ పరికరాలను ఉచితంగా అందించిన కానిస్టేబుల్ అనిల్ కుమార్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్ర బీసీ సంక్షేమం శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాలకృష్ణ జిమ్ అభివృద్ధికి రూ.5 లక్షలు విలువైన పరికరాలను అందజేశారని ఆయనకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. విద్యార్థులు రోజూ వ్యాయామం చేయాలని సూచించారు. యువతకు మంచి శిక్షణ నిస్తున్న జిమ్ కోచ్ గండేటి రమణను మూర్తి అభినందించారు. పట్టణ పార్టీ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, వెయిట్‌లిఫ్టింగ్ కోచ్ డి.సిద్ధయ్య, షటిల్ బ్యాడ్మింటన్ కోచ్ శిరిగినీడి దుర్గాప్రసాద్, వెటర్నరీ కళాశాల ఫిజికల్ ట్రైనర్ మీసాల అప్పన్న, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, పండు, సతీష్, అడపా చిన్న, పసుపులేటి శ్రీనివాస్, పంతుల ప్రసాద్, జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు.



కృత్తివెంటి పేర్రాజు పంతులు జిమ్‌ను ప్రారంభిస్తున్న తొగరు మూర్తి

పాల వాహనం ఢీకొని యువకుడి మృతి



గాయాలతో పడి ఉన్న క్షతగాత్రుడు

కపిలేశ్వరపురం: మండలంలోని వెదురుమూడి సమీపంలో ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై పాల వాహనం ఢీకొట్టడంతో యువకుడు మృతి చెందాడు. అంగర ఎస్సై జి.చంటి కథనం ప్రకారం.... తాళ్ళరేవు మండలం ఉప్పలంకకు చెందిన పంపన మల్లేశ్వరరావు(23), పంపన సత్యసదీప్‌లు కపిలేశ్వరపురం మండలం నల్లూరులో శనివారం బిల్డింగ్ సీలింగ్ పని చేశారు. పని పూర్తి చేసుకుని అంగర మీదుగా స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. అంగర నుంచి వెదురుమూడి వైపు వెళ్తున్న పాల వాహనం వెదురుమూడి సమీపంలో వారి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. వాహనాన్ని నడుపుతున్న మల్లేశ్వరరావుకు తీవ్ర గాయాలుకావడంతో 108 వాహనంలో మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆసుపత్రి సమాచారంపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై చంటి తెలిపారు.